కథానిక

# ప్రదానం



**శ**శిధర్ ఆరోజు ఆఫీసు నుండి వచ్చేసరికి సాయంత్రం ఆరైంది. ఇంటికి రావడంతోనే స్నానంచేసి ఇస్త్రీ బట్టలు తొడుక్కున్నాడు.

"చీకటి పడుతోంది. ఇవాళ పార్కుకి వెళ్లక పోతేనేం!" అన్నది సరిత భర్తకు హార్లిక్స్ అందిస్తూ.

మాట్లాడలేదు శశిధర్.

ఆకలి వేస్తున్నప్పుడు హోటల్‌కి వెళ్లొద్దన్నా మానెస్తాడేమోగాని, సాయంత్రాలు పార్కుకి మాత్రం వెళ్ళకుండా ఉండలేడు. పెళ్ళైన తొలి రోజుల్లో సరితతో కలిసి పార్కుకి షికారుగా వెళ్ళేవాడు. రానురాను సంసారం పెరగడం, పని ఒత్తిడి వలన షికార్లకు స్వస్తి చెప్పింది సరిత. తను మాత్రం ఆ అలవాటుకు దూరం కాలేకపోతున్నాడు. అందుకే అతడి ప్రయత్నాన్ని మరి నిరోధించలేకపోయింది.

శశిధర్ ప్రకాశం పార్కులోకడుగు పెట్టేసరికి దీపాలు వెలిగాయి. మెర్క్యురీ లైట్ల కాంతి పార్కంతా దట్టంగా పరుచుకుంది. ఎప్పటిలాగే పూలపొదల చాటున గడ్డినేల మీద చతికిలబడ్డాడు.

ఎదురుగా కొద్ది దూరంలో సారథి...

సారథితో శశిధర్ పరిచయం అంతంత మాత్రమే. అయితే అతడి భార్య సుకన్య, సరిత ఎంతో క్లోజుగా వుంటారు.

"ఒరేయ్ సారథీ మొన్న నీ పెళ్ళి చూపులికి పార్టీ ఇచ్చావు. మరి ప్రదానం మాటేమిటి? ఈ రోజు డిన్నర్ ఇస్తేగాని విడిచిపెట్టేదిలేదు" అంటూ పట్టుబట్టారు అక్కడకు చేరిన సారథి మిత్రబృందం.

"మీ మాట నేనెప్పుడు కాదన్నానని. పదండి... ఇవాల్టి స్వీటు, హాటు తీసుకుందాం"

అంటూ లేచాడు శశిధర్.

"సరే నీ ఇష్టం" మిత్రబృందం సారధితో కలిసి మణిస్ కేఫ్ వైపు వెళ్ళారు.

సారధికి పెళ్ళి చూపులు, ప్రదానం మాట విని అదిరిపడ్డాడు శశిధర్? ఇద్దరు పిల్లలున్న సారధి మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడా? పాపం సుకన్యకు ఈ విషయం తెలుసునో, తెలియదో? అయినా పెళ్ళాం పిల్లలున్న సారధికి పెళ్ళేమిటి? మరి అక్కడ ఉండబుద్ధి కాలేదు శశిధర్‌కి. గభాలున లేచి ఇంటికి వెళ్ళి సరితతో తను పార్కులో విన్నదంతా పూసగ్రుచ్చినట్లు వివరించాడు.

"సారధిగారు మళ్ళీ పెళ్ళి చేసుకోవడమేమిటండి? మీకు మతిపోయిందా?"

"లేదు సరితా, నా చెవులతో నేను విన్నాను. ఇవాళ అతడి ప్రదానమట. స్నేహితులతో కలిసి హోటల్‌కి వెళ్లడం నేను కళ్ళారా చూశాను."

"అలాగా? ఐతే ఇప్పుడే సుకన్యకి ఈ విషయం చెప్పాలి. మీరన్నదే నిజమైతే నలుగురిలో అతడి బండారం బయటపెట్టి ఈ పెళ్ళి జరగకుండా మనం అడ్డుపడాలి. అభం శుభం ఎరుగని సుకన్యకు అన్యాయం జరగకూడదు" అంటూ ఉన్న పళంగా చీర మార్చుకుని ఆటోలో సుకన్య దగ్గరకు వెళ్ళింది సరిత.

ఇంటికి వచ్చిన స్నేహితురాలిని సాదరంగా లోపలకు ఆహ్వానించింది సుకన్య.

"మర్యాదుల తరువాత, ముందు నీకీ విషయం తెలుసా?"

సరిత మాటలకు ప్రశ్నార్థకంగా ముఖం పెట్టింది సుకన్య కొంత ఆశ్చర్యాన్ని జోడిస్తూ.

"మీ ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకోబోతున్నారు" చెప్పదలచుకున్నదేదో కుండబ్రద్దలు కొట్టినట్లుగా చెప్పేసింది సరిత.

"ఛ ! అవేం మాటలే. ఇద్దరు పిల్లల తండ్రి, ప్రాణప్రదంగా చూసుకునే నా భర్త మళ్ళీ పరిణయమాడడమా? !... నెవ్వర్...నువ్వుమతి వుండే మాట్లాడుతున్నావా?"

"లేదే మతిపోయే నీ దగ్గరకొచ్చాను. మీ ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడన్న వార్త విన్నాక నా మతి పూర్తిగా పోయింది."

"ఏమిటే నువ్వంటున్నది?" ఈ మారు ఆశ్చర్యపోవడం సుకన్య వంతు అయింది.

"ఈ రోజు మీ ఆయన ప్రదానం అంటూ ఫ్రెండ్స్‌కి పార్టీ ఇవ్వడం నా భర్త కళ్ళారా చూశారు."

సరిత మాటలకు పకపక నవ్వింది సుకన్య.

"నేనెంతో బాధతో చెబుతూవుంటే నవ్వుతావేమిటి?" కోపగించుకుంది సరిత.

"నవ్వక ఏం చేయమంటావ్? మొన్న మావారు వ్రాసిన "పెళ్ళిచూపులు" కథ వారపత్రికలో పడింది. ఈ రోజు దిన పత్రికలో "ప్రదానం" అనే కథ ప్రచురితమయింది. రేపో ఎల్లుండో ఆయన రచించిన "పెళ్ళి" పక్షపత్రికలో రాబోతోంది. అందుకే ఫ్రెండ్స్‌కి పార్టీ. అసలు విషయం తెలియక మీరంతా పొరబడ్డారు" అన్నది సుకన్య.

మరి పెదవులు విడలేదు సరితకు.